క్లుప్తంగా

విజయకృష్ణా సూపర్‌బజార్ చైర్మన్‌గా మనం వెంకటేశ్వరరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయకృష్ణా సూపర్ బజార్ చైర్మన్‌గా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన మనం వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఎంజీ రోడ్డులోని విజయకృష్ణా సూపర్‌బజార్‌లోని చాంబర్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో సూపర్‌బజార్ ఎండీ కిరణ్ ప్రమాణం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు.. చైర్మన్‌గా నియమితులైన మనం వెంకటేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పెన్మత్స శిరీష, తిరుపతమ్మ, నేత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో 'నా మట్టి నా దేశం'

విజయవాడ కల్చరల్: ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 14, 15 తేదీల్లో సంగీత కళాశాల ప్రాంగణంలో నా మట్టి నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 వ తేదీ సాయంత్రం కళాశాల నుంచి బీఆర్టీఎస్ రోడ్డు చివరి వరకు శోభాయాత్ర జరుగుతుందని, 15 వ తేదీ ఉదయం కళాశాలలో స్వాతంత్ర్య దినోత్స వం, కళావేదికపై సంప్రదాయ నృత్యాలు, దేశ భక్తి గీతాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు శతాధిక కవయిత్రుల కవితోత్సవం

విజయవాడ కల్చరల్: నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ శనివారం ఉదయం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో సంస్థ 6వ వార్షికోత్సవం సందర్భంగా శతాధిక కవయిత్రుల కవితోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ గురువారం ఒక ప్రటకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన కవయిత్రులు స్వీయకవితా గానం చేస్తారని, పలువురికి పురస్కార ప్రదానం జరుగుతుందని పేర్కొన్నారు.

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'పై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఏపీ కళాశాల విద్య కమిషనరేట్ సహకారంతో అంతర్గత మూల్యాంకనంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్రపై అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో కళాశాల విద్య అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి మాట్లాడుతూ ఉన్నతవిద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను విద్యార్థుల ఎసైన్‌మెంట్‌లు, అంతర్గత పరీక్షల ఫలితాల విశ్లేషణలో ఉపయోగించవచ్చునన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎస్ఆర్ఎస్ అటెండెన్స్ వంటి వాటిలో ఉపయోగిస్తున్నామని రాబోయే కాలంలో విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడంలో ఉపయోగించబోతున్నామన్నారు. అనంతరం అస్లాం షరీఫ్ నూతన పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరావు, అధ్యాపకులు కె.ఎల్.సి దేవి, రోజలింగ్, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ కె.సుధాకరరావు, సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నీరజ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు ఉత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): రూరల్ మండలం గొల్లపూడి పంచాయతీ పరిధిలోని నల్లకుంటలో హజరత్ సయ్యద్ మజీలీ బాబా రహమతుల్లా అలైహి అవులియా కరీం దర్గా 29వ ఉరుసు మహోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. దర్గా ముతవలి షేక్ ఖాజా ఆధ్వర్యంలో మేళతాళాల నడుమ పకీర్లు బాబాను కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. ఆయన దర్గాలోని బాబా సమాధిపై చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని బాబాను ప్రార్థించారు. ఉరుసు మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం సాయంత్రం చిరాగ్ (దీపారాధన) చేస్తామని, అనంతరం అన్నదానం జరుగుతుందని ముతవలి షేక్ ఖాజా చెప్పారు. దర్గాకు తనను రెండో సారి ముతవలిగా నియమించటంద్వారా బాబాకు సేవ చేసుకునే అదృష్టం కలిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూఫీ మతగురువు అల్తాఫ్ రజా, ఖాజీ నవాజ్, జాయింట్ ముతవలి షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ సీఎం జగన్

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి



ఐరన్ యార్డులో నిర్మించిన బీటీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధి, సంక్షేమ పాలనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా మారారని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గొల్లపూడి ఐరన్ యార్డులో గురువారం రూ. 3 కోట్ల నిధులతో రోడ్లు, కార్మికుల కోసం నిర్మించిన భోజనశాలను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. లారీస్టాండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. వెలంపల్లి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో మార్కెట్ యార్డ్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఆ సమయంలో తమకు రోడ్లు నిర్మించాలని, కార్మికులకు భోజన వసతి కోసం షెడ్ నిర్మించాలని అసోసియేషన్ ప్రతినిధులు తన దృష్టి తెచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత యార్డ్‌లో 90శాతం పైగా రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. ఇంకా కొన్ని రోడ్లు మిగిలిపోయాయని, వాటిని వీలైనంత త్వరలో పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న లారీస్టాండ్ సిటీ మధ్యలో ఉందని, యార్డ్‌లో నూతన లారీ స్టాండ్ నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. ఆఫీసులు కూడా నిర్మిస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతమిస్తోందన్నారు. అభివృద్ధి చేస్తున్నా కొంత మంది ప్రతిపక్ష నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఇది తగదని హితవు పలికారు. గతంలో జలీల్‌ఖాన్ రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి ఐరన్ యార్డ్‌ను అభివృద్ధి చేయలేకపోయారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అంతా టీడీపీకి చెందిన వారే ఉన్నా యార్డు సమస్యలు పట్టించుకోలేదని గుర్తు చేశారు. డ్రెయినేజీ నిర్మాణాలకు కేంద్రం కేటాయించిన నిధులు అమరావతికి మళ్లించిన దుర్మార్గుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో అన్ని రోడ్లు సిమెంట్ రోడ్లు వేస్తున్నామని తెలిపారు. నగరాభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికీ మేలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవిష్యత్తులో అభివృద్ధి అంటే ఇలా ఉండాలి అనేలా చేసి చూపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, ఐరన్ యార్డ్ అసోసియేషన్ ప్రతినిధులు వక్కలగడ్డ శ్రీకాంత్, గుర్రం రమణయ్య, అప్పలస్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం భవానీపురం 41వ డివిజన్‌లో దళితవాడ, తూర్పు పాకలు ఏరియాలో ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటికి సకాలంలో పరిష్కారం చూపుతామని చెప్పారు. డివిజన్ పరిధిలోని బరియల్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. డివిజన్‌లో పల్లంలో ఉన్న అన్ని రోడ్ల ఎత్తు పెంచుతున్నట్లు చెప్పారు. అర్హులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలన్న జగనన్న లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, ఆనంద్, లాజర్, అజిత్, జోసఫ్, రెహమాన్, ఇషాక్, కుమార్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాజేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నులిపురుగుల నివారణతో విద్యార్థులకు చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. కొత్తపేటలోని శ్రీ తేలప్రోలు రాజా హైస్కూల్‌లో గురువారం నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్.. ఆల్బెండజోల్ మందులను విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు అద్వితీయమైన ప్రాధాన్యతమిస్తోందన్నారు. వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, నాయకులు తిలక్, ఆనందకుమార్, జానకి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

52వ డివిజన్‌లో..

మానవ శరీరంలో నులిపురుగుల కారణంగా ఎదుయ్యే ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన ఉండాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆయన కొత్తపేటలోని హిందూ హైస్కూల్లో విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచర్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో వీఎంసీ విభాగం వైద్య నిపుణులతో కలిసి ఆయన విద్యార్థులకు మందులు అందజేశారు. రక్తహీనత, బరువు తగ్గటం, బలహీనత, అజీర్ణం వంటి లక్షణాలు కనిపిస్తే విద్యార్థులు వెంటనే నులిపురుగులు నివారణకు వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహను పెంపొందించుకోవాలి



ఇంటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గంతో రోటరీ ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని రోటరీ క్లబ్ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంవీ ప్రసాద్ అన్నారు. నగరంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్‌కు అనుబంధంగా 'ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ చిట్టూరి హై స్కూల్' ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఆ విద్యాసంస్థ ప్రాంగణంలో నిర్వహించారు. ఎంవీ ప్రసాద్ మాట్లాడుతూ రోటరీ సంస్థ ప్రపంచవ్యాప్తంగా సామాజిక కార్యక్రమాల్లో అగ్రగామిగా ముందుకు సాగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి సమాజంపై బాధ్యతను పెంచుకోవాలన్నారు. ఈస్ట్ క్లబ్ అధ్యక్షులు బాయన బాబూజీ (బాబ్జీ) మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలో విస్తృత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇంటరాక్ట్ క్లబ్ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఇంటరాక్ట్ క్లబ్‌లోఎనిమిది, తొమ్మిది, పది తరగతుల బాలబాలికలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గుండారపు శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ కార్యదర్శి మాలపాక భాస్కర్, రోటరీ ప్రముఖులు చిట్టూరి ఆనందరామ్, జేకే సుబ్బారావు, వై.శ్రీనివాసరావు, కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సస్పెక్ట్ షీటర్ అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగర బహిష్కరణకు గురైన సస్పెక్ట్ షీటర్ షేక్ సలామ్‌ను కొత్తపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ వల్లీ వీధికి చెందిన షేక్‌సలాంపై ఈ ఏడాది ఏప్రిల్ 28న పోలీస్ కమిషనర్ నగర బహిష్కరణ విధించారు. గురువారం ఉదయం చిట్టినగర్‌లోని తన ఇంటికి వచ్చిన సలాం భార్యతో గొడవ పడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సలాంను అదుపులోకి తీసుకున్న పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్లు కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

పాతబస్తీలో ముఠా కార్మికుల సమ్మె



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని వివిధ వ్యాపారాల వద్ద ఎగుమతి, దిగుమతులు చేస్తున్న ముఠా కార్మికులు కూలి రేట్లు పెంచాలని గురువారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సమ్మె ప్రారంభంగా కార్మిక ప్రదర్శనను పాతబస్తీలో నిర్వహించారు. స్థానిక చిట్టూరి కాంప్లెక్స్ నుంచి ప్రారంభమై పలు వీధుల మీదుగా ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యాకులు డీవీ కృష్ణ, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ ముఠా కార్మికుల కూలీల పెంపుదల కోసం చేస్తున్న సమ్మెకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్మిక సంఘాలతో చర్చించి సమస్య పరిష్కారించాలని యజమానులను కోరారు. ప్రదర్శనలో ముఠా కార్మిక నాయకులు ఎం.సీతారాములు వి.నాగేశ్వరరావు, బ్రహ్మయ్యనారాయణ, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి

పాయకాపురం(విజయవాడరూరల్): పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ అన్నారు. గురువారం కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి హైస్కూల్లో బాలల పరిరక్షణ–తల్లిదండ్రుల బాధ్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ తిరుపతమ్మ మాట్లాడుతూ పిల్లలను స్కూల్‌కు పంపించడంతోనే బాధ్యత సరిపోదని తల్లిదండ్రుల పర్యవేక్షణ వుండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


జనసైనికుల్లో వర్గపోరు!

నేడు పోటా పోటీగా దర్గా టు దుర్గమ్మ పాదయాత్రలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జనసైనికుల్లో వర్గపోరు మరోసారి బట్టబయలైంది. రాజకీయాల్లో మతాలను జొప్పించి పాదయాత్రలను చేపట్టటం గమనార్హం. భవానీపురం 40వ డివిజన్‌లో ఆ పార్టీ నగర అధికార ప్రతినిధి, ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాజుద్దీన్ (ఐజా)కు రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్‌కు కొంత కాలంగా పొసగడం లేదు. ఈ క్రమంలోనే పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ గయాజుద్దీన్ ఈ నెల 11న దర్గా టు దుర్గమ్మ గుడి వరకు పాదయాత్ర చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. దీన్ని చూసిన 40వ డివిజన్‌కు చెందిన జనసేన పార్టీ యాక్టివ్ మెంబర్‌షిప్ కో ఆర్డినేటర్ హనుమాన్ గయాజుద్దీన్‌కు పోటీగా అదే రోజు వారాహి యాత్ర విజయవంతం కావాలని కోరుతూ పాదయాత్ర చేయనుండటం చర్చనీయాంశమైంది. ఇదంతా మహేషే కావాలని చేయిస్తున్నాడన్నది గయాజుద్దీన్ వర్గం ఆరోపిస్తుంది.

గ్రంథాలయాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న జమలపూర్ణమ్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా గ్రంథాలయలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి మౌలిక వసతులను కల్పించడం ద్వారా పాఠకుల మన్ననలను పొందేందుకు కృషి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ పేర్కొన్నారు. పాఠకులకు పుస్తక పంపిణీ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. గురువారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలకు ఆమోదం తెలిపారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాఖాగ్రంథాలయాలలో మౌలిక వసతులు కల్పించి పాఠకులకు మెరుగైన సేవలందిస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 109 శాఖా గ్రంథాలయాలకు అదనంగా 161 పుస్తక పంపిణీ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు అనుమతించామన్నారు. వీటిలో గత బడ్జెట్‌లో సిబ్బంది జీతభత్యాలు, పెన్షన్లు, వాహన చార్జి ప్రయాణ భత్యం, ఇతర పనులకు చెల్లించిన రూ.7.73 కోట్ల ఖర్చులకు సమావేశం ఆమోదం తెలిపిందన్నారు. రూ. 56 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఠాగూర్ స్మారక గ్రంథాలయం అదనపు భవన నిర్మాణ పనులు వేగవంతం చేస్తామన్నారు.

సౌకర్యాల కల్పనకు నిధులు..

శాఖా గ్రంథాలయలకు అవసరమైన కంప్యూటర్స్, స్టేషనరీ కొనుగోలుకు రూ.3 లక్షలు మంజూరు చేశామన్నారు. పాఠకుల సౌకర్యార్థం రూ. 90 లక్షలతో పుస్తకాలు కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. గ్రంథాలయాలలో టాయిలెట్స్ ప్రహరీల నిర్మాణం, అదనపు గదుల నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేయడంతో పాటు దృశ్య శ్రవణ పరికరాల కొనుగోలుకు రూ. 2 లక్షల ఖర్చు చేసేందుకు సమావేశంలో తీర్మానం చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలోని జమిగోల్వేపల్లి, గుడ్లవల్లేరు గ్రంథాలయాలలో దాతల సహకారంతో 905 పుస్తకాల కొనుగోలు చేసినట్లు తెలిపారు. తిరువూరు, జమీగొల్వేపల్లి, మల్లవోలు గ్రంథాలయాలలో దాతల సహకారంతో సీలింగ్ ఫ్యాన్లు, ఐరన్ బీరువాలు, వాటర్ డిస్పెన్సర్, స్టీలు కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు.. సత్యనారాయణపురం, చౌటపల్లి, మల్లవోలు, చిలకలపూడి, తిరుపూరు, జి. కొండూరు, పెద ఓగిరాల, మానికొండ శాఖా గ్రంథాలయాలలో పనికి రాని పుస్తకాలను రద్దుకు తీర్మానం చేశారు. గ్రంథాలయాలపై ప్రజలకు ఆసక్తి కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో సభ్యులు వయోజన విద్యా ఉపసంచాలకులు ఎండీ హబీబేగ్, సమాచార పౌర సంబంధాలు అధికారి ఎస్వీ మోహన్‌రావు , గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ బి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుర్లపాటి పాత్రికేయ జీవితం ఆచరణీయం

అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



సభలో మాట్లాడుతున్న విజయబాబు, వేదికపై మల్లాది విష్ణు, గోళ్ల నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు జీవితం ఆదర్శనీయం, ఆచరణీయమని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కృష్ణ కళాభారతి, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు జయంతి వేడుకలను నిర్వహించారు. విజయబాబు మాట్లాడుతూ తన రచనలతో తుర్లపాటి ఎందరో యువ పాత్రికేయులకు స్ఫూర్తిని కలిగించినట్లు తెలిపారు. సుదీర్ఘకాలం కాలమ్‌ను నడిపిన ఏకైక వ్యక్తి తుర్లపాటి అని అభివర్ణించారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ వివిధ పత్రికల్లో ఆయన రాసిన వ్యాసాలు తనను ప్రభావితం చేసినట్లు తెలిపారు. పాత్రికేయ విలువల కోసం నిరంతరం పాటుపడేవారన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జనహృదయ నేత వైఎస్ రాజశేఖరెడ్డి తుర్లపాటి ఎంతోసన్నిహితంగా ఉండేవారని తెలిపారు. తర్వాత ఆయనకు ఏపీ గ్రంథాలయ పరిషత్ పదవి లభించినట్లు తెలిపారు. తుర్లపాటి జవహర్.. కుటుంబరావుతో ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. గోళ్ల నారాయణరావు సభను సమన్వయ పరిచారు. జయంతి కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, శ్రీకళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి పెద బ్రహ్మం, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు డాక్టర్ ఇండ్లరామ సుబ్బారెడ్డి, అంబటి మధుమోహన కృష్ణ, యు. శ్రీనివాసరాజు పాల్గొన్నారు. అతిథులను మల్లాది విష్ణు సత్కరించారు.

మెప్మా అర్బన్ మార్ట్‌ను వినియోగించుకోండి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



మెప్మా అర్బన్ మార్ట్‌లోని వస్తువులను పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అవినాష్ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్ట్‌ను నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక విశాలాంధ్ర రోడ్డులోని బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో మెప్మా అర్బన్ మార్ట్‌ను రాయన భాగ్యలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో సభ్యులు తయారు చేసిన వస్తువులను తయారీ ధరలకే విక్రయిస్తారని చెప్పారు. మహిళల సంక్షేమానికి సహకరిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మహిళల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని చెప్పారు. కార్పొరేషన్ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.శకుంతల మాట్లాడుతూ శుక్రవారం కూడా మెప్మా అర్బన్ మార్ట్ ఉంటుందన్నారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, సీడీవో ఉమామహేశ్వరి, కార్పొరేటర్ అమర్, సోషల్ వర్కర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్



సచివాలయంలో తనిఖీ చేస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): సచివాలయాల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ ఆదేశించారు. ఆయన గురువారం 63వ డివిజన్‌లోని రాజీవ్‌నగర్‌లో 273, 274 వార్డు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 ఫీడ్ బ్యాక్ వెరిఫికేషన్, సచివాలయాల్లో ఇన్‌స్పెక్షన్ రిజిస్టర్, నోటీసు బోర్డు, హాజరు, స్పందన రిజిస్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

ఎస్.డి.జి సర్వే, భూహక్కు సర్వే, ఎ.పి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేయాలని తెలిపారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు – నేడు పనుల పురోగతి, ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, తమకు నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులో అందుకోవాలని సూచించారు. జగనన్న కాలనీ లే అవుట్ల నిర్మాణ పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఎమినిటీస్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో వీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేశ్వరాలయ పనులు త్వరగా చేయండి



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిటీ చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను గురువారం చైర్మన్, పాలక మండలి సభ్యులు పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనుల పురోగతి, పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయనే వివరాలను కాంట్రాక్టర్ నటరాజును అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తయ్యేలా సిబ్బంది మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వామివారి ఆలయ నిర్మాణం ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, కేసరి నాగమణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్క నాటుతున్న కార్పొరేటర్ అప్పాజీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవు అప్పాజీరావు చెప్పారు. పాతబస్తీలోనే 53వ డివిజన్ పరిధి గణపతిరావు రోడ్డులో కొత్తపేట హిందూ హైస్కూల్ ఎన్‌సీసీ విభాగం విద్యార్థులు మొక్కలు నాటి ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. 'మేరీ మట్టి – మేరీ దేశ్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో 51వ డివిజన్ కార్పొరేటర్ ఎం.రాజేష్, శ్రీశైలం దేవస్థానం ధర్మకర్త గురుమహంతు మహేష్, నాయకులు పడాల రాజేష్ పాల్గొని గణపతిరావురోడ్డు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మహదేవు అప్పాజీరావు జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కోసి విద్యార్థులకు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలను ఎదిగేంతవరకు స్థానికులే సంరక్షించుకోవాలని సూచించారు. హిందూహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. ఇది ఒక ఉద్యమంలా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఎన్‌సీసీ అధికారి బి. బ్రహ్మేశ్వరరావు, శానిటరీ అధికారి శ్రీనివాసరావు, పార్కుల సూపర్‌వైజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.